సాక్షి
అన్నమయ్య జిల్లా
ఆదివారం । 30 । జూలై । 2023



‘పట్టు’ తప్పింది..!

సమైక్య రాష్ట్రంలో పట్టు రైతులకు మెరుగైన సేవలందించిన.. బి.కొత్తకోట మండలం బయ్యప్పగారిపల్లె గ్రామంలోని ప్రాథమిక బీజక్షేత్రంలో పట్టుగూళ్ల ఉత్పత్తి ఆగిపోయింది. -8లో



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పూజారులు మృతి

తంబళ్లపల్లె నియోజకవర్గంలో పూజారులుగా పనిచేస్తున్న ఇద్దరు అనంతపురం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1600	రూ.1960
రెండోరకం	రూ.1200	రూ.1560

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 253 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	355	455
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 243.78 కిలోలు

న్యూస్‌రీల్

3న అథ్లెటిక్ మీట్

మదనపల్లె సిటీ: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో ఆగస్టు 3 నుంచి రీజనల్ లెవల్ అథ్లెటిక్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ గోవిందరావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రీజనల్ లెవల్ అథ్లెటిక్స్ మీట్‌కు పలు రాష్ట్రాల నుంచి నవోదయ విద్యాయల క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు.

పారదర్శకంగా రేషన్ పంపిణీ: జేసీ

రాయచోటిటౌన్ : ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న రేషన్‌ను పారదర్శకంగా ప్రజలకు అందజేస్తున్నామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 12 ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా 1123 రేషన్ షాపులకు సరుకులు చేరవేస్తున్నట్లు తెలిపారు. 310 ఎండీయూ ఆపరేటర్ల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలో జాతీయ ఆహార భద్రత పథకం రాష్ట్ర రేషన్ కార్డు కింద నెలకు 7,500 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న బియ్యం నాణ్యమైనదని, బాలింతలు గర్భిణులు, చిన్న పిల్లలకు మంచి పోషకాలు లభిస్తాయని వివరించారు. ఈ బియ్యాన్ని బయటి మార్కెట్‌కు అమ్మకూడదని సూచించారు. ఎవరైనా కొంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముస్లిం మైనార్టీ విద్యార్థులకు నేరుగా అడ్మిషన్లు

కడప ఎడ్యుకేషన్: ఏపీఆర్‌ఈఐఎస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉర్దూ గురుకుల పాఠశాలల్లో 5,6,7,8 తరగతులు చదువుతున్న ముస్లిం మైనార్టీ విద్యార్థులను ఎలాంటి పరీక్షలు లేకుండా నేరుగా పాఠశాలలో చేర్చుకుంటామని ఏపీ ఆర్‌ఈఐఎస్ ప్రిన్సిపాల్, కన్వీనర రామచంద్రయ్య తెలిపారు. అలాగే సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలల్లో జనరల్, మైనార్టీ బాలురు.. మే నెల 25వ తేదీన పరీక్ష రాసి ఇప్పటివరకు సీట్లు రాని వారు ఎవరైనా ఉంటే వెంటనే కలవాలని తెలిపారు. వివరాలకు 7780179446, 9491035236 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రైల్వే ట్రాక్‌కు మరమ్మతులు

వాల్మీకిపురం: పాకాల - ధర్మవరం రైల్వే లైన్‌లోని వాల్మీకిపురం - నిమ్మనపల్లి రోడ్డు వద్ద ఈ నెల 31, ఆగస్టు 1వ తేది 101వ లెవల్ క్రాసింగ్ వద్ద రైల్వే ట్రాక్, రోడ్డు మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు కలికిరి రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ వెంకటేశ్వర రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైల్వే ట్రాక్ మరమ్మతులు జరుగుతున్నందున ఈ రెండు రోజులు ప్రజలు, ప్రయణికులు, వాహనదారులు తమకు సహకరించాలని కోరారు. వాహనదారులు ఎవ్వరూ వాల్మీకిపురం - నిమ్మనపల్లి రైల్వే గేటు మార్గంలో రావద్దని సూచించారు.

తిరుపతి-షోలాపూర్ మధ్య ప్రత్యేక రైలు



షోలాపూర్ ఎక్స్‌ప్రెస్

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా తిరుపతి-షోలాపూర్-తిరుపతి మధ్య వారాంతపు రైలును నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ తెలిపారు. ఆగస్టు 3న రాత్రి 9.40 గంటలకు ఈ రైలు (01437) షోలాపూర్‌లో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 7.45 గంటలకు తిరుపతి చేరుతుందన్నారు. తిరుపతిలో అదేరాత్రి 9.10 గంటలకు బయలుదేరి మరుసటిరోజు రాత్రి 7.10 గంటలకు షోలాపూర్ చేరుతుందన్నారు. ఈ రైలు రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం, రాయచూర్, యాదగిరి, వాడి, కలబుర్గి, బీదర్, లాతూర్ మీదుగా షోలాపూర్‌కు చేరుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉజ్వాల భవితకు నవోదయం

- ఆరోతరగతిలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం
- ఆగస్టు 10 వరకు గడువు



మదనపల్లెలోని జవహర్ నవోదయ విద్యాలయం

మదనపల్లె సిటీ: ప్రతిభావంతులైన విద్యార్థులకు పట్టం కట్టి వారికి ఉజ్వల భవిష్యత్తునిచ్చే ఆలయం నవోదయ విద్యాలయం. అందుకే ఇందులో తమ పిల్లల్ని చేర్చేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు పోటీపడుతుంటారు. ఆరో తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్షే ఆధారం. ఇందులో ప్రతిభ చూపితే సీటు ఖాయం. 2024-25 ఏడాదికి సంబంధించి ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. సమయం కేటాయించి ప్రణాళికబద్ధంగా చదివితే సీటు సాధించవచ్చునని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. కేంద్ర జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి 1986లో జవహర్ నవోదయ విద్యాలయాలు స్థాపించింది. 6 నుంచి 12వ తరగతి వరకు తరగతులు కొనసాగిస్తున్నారు. ఆరు నుంచి 7 వరకు ప్రాంతీయ,మాతృభాషల్లో బోధన సాగుతోంది. గణితం, సైన్స్ పాఠ్యాంశాలను ఆంగ్లంలో, సామాజిక శాస్త్రాలు హిందీలో చెబుతున్నారు. పదో తరగతి వరకు ‘సీబీఎస్‌ఈ’ను అమలు చేస్తున్నారు.

ఆన్‌లైన్ ద్వారా...

మదనపల్లె సమీపంలోని చిత్తూరు రోడ్డులో జవహర్ నవోదయ విద్యాలయం ఉంది. 6వ తరగతి 80 సీట్లకు ప్రవేశపరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. ఇందుకు ఆగస్టు 10వ తేదీ వరకు గడువు విధించారు. అర్హులైన విద్యార్థులు సీఎస్‌సీ(కామన్ సర్వీస్ సెంటర్లు), మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. రెండు దశలను అనుసరించాల్సి ఉంటుంది. ముందుగా www.navodaya.gov.in వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రెండో దశలో 3,4,5 తరగతి విద్యాధృవపత్రాలపై ప్రధానోపాధ్యాయుడి సంతకం చేయించి స్కాన్ చేసిన పత్రాలు అప్‌లోడ్ చేయాలి. పరీక్ష సమయంలో హాల్‌టిక్కెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.

రిజర్వేషన్ విధానం...

ఆరులో 80 సీట్లు ఉండగా, 75 సీట్లు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి కేటాయిస్తారు. ఐదు సీట్లు పట్టణ ప్రాంతాల వారికి నిర్దేశించారు.జిల్లా జనాభా ప్రాతిపదికన ఎస్టీలకు 15 శాతం, ఎస్సీలకు 7.5 శాతం, బాలికలకు 1/3 శాతం, దివ్యాంగులకు 3 శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు గుర్తింపు పొందిన పాఠశాలల్లో వరుసగా 3,4 వ తరగతి చదివి అదే పాఠశాలలో ప్రస్తుతంత 5వ తరగతి చదువుతున్న వారు అర్హులు. నవోదయలో ఉమ్మడి జిల్లాల వారీగా ఎంపిక ప్రక్రియ ఉంటుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

వసతుల కల్పన..

మదనపల్లె పట్టణం చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో అన్ని సౌకర్యాలు కల్పించారు. ఉత్తమ బోధన అందిస్తున్నారు. విద్యాలయంలో తరగతులకు అకడమిక్ బ్లాక్, పాలనా సౌలభ్యానికి అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, బాలబాలికలకు వేర్వేరుగా డార్మెటరీలు, భోజనశాలలు, బోధకులు, సిబ్బందికి ప్రత్యేక సముదాయాలు కొలువుదీరాయి. పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వడంతో వృక్షాలతో అలరాలుతోంది. విద్యాలయం మొత్తం సీసీ రోడ్లు నిర్మించారు. ఆవరణలో క్రీడల కోసం ప్రత్యేక స్టేడియం ఏర్పాటు చేశారు. క్రీడల కోసం ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేశారు. స్మార్టు తరగతుల కొనసాగిస్తున్నారు. డూయింగ్ బై లర్నింగ్, ప్రయోగాత్మక విద్యను అందిస్తున్నారు. సైన్సు, కంప్యూటర్ ల్యాబ్‌లు కొలువుదీరాయి. గ్రంథాలయంలో నవోదయ విద్యాలయం వనరుల కేంద్రంగా ఉంది.

ప్రతిభావంతులకు గొప్ప అవకాశం



ప్రతిభ ఉన్న గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఇదో గొప్ప అవకాశం. దీనిని సద్వినియోగం చేసుకోవాలి. తల్లిదండ్రుల కృషి, విద్యార్థుల పట్టుదల, ఉపాధ్యాయుల ప్రణాళికతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే నవోదయలో సులభంగా ప్రవేశం పొందవచ్చు. -గోవిందరావు, ప్రిన్సిపాల్, నవోదయ విద్యాలయ, మదనపల్లె

వాహనదారులు సకాలంలో పన్నులు చెల్లించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: వైఎస్సార్ జిల్లాలోని వాహన యజమానులు సకాలంలో పన్నులు చెల్లించాలని జిల్లా ఉపరవాణా శాఖ కమిషనర్ ఈ.మీరాప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కడపలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 7263 వాహనాలు రవాణా శాఖకు త్రైమాసిక బకాయిలు చెల్లించలేదని వాహన యజమానులు స్పదించి పన్నుబకాయిలను చెల్లించాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. తనిఖీల్లో వాహనాలు పట్టుబడితే చెల్లించిన పన్నులతో పాటు 200 శాతం అదనంగా జరిమానా విధిస్తామన్నారు. జిల్లాలో 944 విద్యా సంస్థల బస్సులకు గాను 855 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేయడం జరిగిందన్నారు. ఇంకా 89 బస్సులు ఫిట్‌నెస్ చేయించుకోవాల్సిందన్నారు. సంబంధిత బస్సులు విద్యా సంస్థల వద్ద లేనట్లయితే రిజిస్ట్రేషన్ రద్దు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వైభవం.. బాసికోత్సవం



ప్రార్థనలు నిర్వహిస్తున్న కడప పెద్ద దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుసేని



బాసికాన్ని ఊరేగింపుగా తీసుకువస్తున్న ముంబై ఏజాస్ అలీఖాన్

చిన్నమండెం: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని చిన్నమండెం మండలంలో మొహర్రం ఉత్సవాలు ప్రతి ఏడాది వైభవంగా జరుగుతాయి. ఇందులో భాగంగా కీలక ఘట్టమైన బాసికోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముంబై ఏజాస్ అలిఖాన్ తన ఇంటి నుంచి బాసికాన్ని పీర్ల మఖాన్ వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి వేడుకలను తిలకించారు. రాయచోటి రూరల్ సీఐ లింగప్ప పర్యవేక్షణలో పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. బాసికోత్సవంలో కడప పెద్ద దర్గా పీఠాధిపతి హజరత్ ఆరిఫుల్లా హుసేనీ పాల్గొన్నారు.

టమాటా ధర పైపైకి

- మదనపల్లె మార్కెట్‌లో కిలో రూ.196
- రోజురోజుకీ తగ్గిపోతున్న దిగుబడులు



మదనపల్లె టమాటా మార్కెట్లో జరుగుతున్న వేలంపాటలు

మదనపల్లె: టమాటా ధర రోజు రోజుకూ పైకి ఎగబాకుతోంది. దేశంలోనే టమాటా అమ్మకాలకు పేరు మోసిన మదనపల్లె మార్కెట్‌లో టమాటా ధర మోత మోగుతోంది. మూడురోజుల కిందట రైతులు తీసుకువచ్చిన మొదటిరకాన్ని వ్యాపారులు కిలో రూ.168 చొప్పున కొనుగోలు చేస్తే...శనివారంకు కిలో రూ.196కు చేరుకుంది. మదనపల్లె టమాటా మార్కెట్ చరిత్రలో ఇప్పటివరకు ఈ ధర గరిష్టం. హోల్‌సేల్ మార్కెట్లో కిలో ధరలు రూ. 120-196 మధ్య నమోదైతే బహిరంగ మార్కెట్లో వినియోగదారులకు రూ.150-225 మధ్య లభిస్తోంది. శనివారం మదనపల్లె టమాటా మార్కెట్లో 25కిలోల ప్లాస్టిక్ క్రేట్ ధర రూ.4,900-5,200 వరకు ధర పలికింది. దేశంలోని ఉత్తరాది రాష్ట్రాల్లో అధిక వర్షాలతో రైతులు పంట నష్టపోగా, కర్ణాటకలో వైరస్ సోకడంతో దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. దీంతో ప్రస్తుతం దేశవ్యాప్తంగా టమాటా కేవలం చిత్తూరు జిల్లాలోని పలమనేరు, పుంగనూరు, అన్నమయ్యజిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, కర్ణాటకలోని కోలారు జిల్లాల్లో మాత్రమే లభిస్తోంది. మదనపల్లె టమాటా మార్కెట్లోనూ సీజన్ ముగింపు దశకు చేరుకుంది. గత ఏడాది జూలైలో మార్కెట్‌కు 4,13,400 క్వింటాళ్ల దిగుబడులు వస్తే.. ఈ ఏడాది జూలై 29వ తేదీ వరకు 1,75,390 క్వింటాళ్లు మాత్రమే అమ్మకాలకు వచ్చాయి.రోజురోజుకీ మార్కెట్‌కు వస్తున్న దిగుబడులు తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం మదనపల్లె మార్కెట్ నుంచి టమాటా తమిళనాడు, చత్తీస్‌గఢ్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, మన రాష్ట్రంలోని తిరుపతి, నెల్లూరు, శ్రీకాళహస్తి, విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, గుంటూరు మార్కెట్లకు ఎగుమతులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఆకాశాన్నంటుతున్న టమాటా ధరలు మరో 20 రోజుల వరకు ఇలాగే ఉండే పరిస్థితి ఉందని, తర్వాత అనంతపురం, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో దిగుబడులు రావడంతో తగ్గుముఖం పడుతాయని మార్కెట్‌కమిటీ సెక్రటరీ అభిలాష్ తెలిపారు. సుమారు నెలరోజులుగా టమాటా ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఇతర పంటలను వదిలిపెట్టి పెద్ద విస్తీర్ణంలో టమాటా సాగుచేసేందుకు సన్నద్ధమవుతున్నారని చెప్పారు. మూడు రోజులుగా వర్షం పడి ఎండ వస్తుండటంతో అరకొరగా లభిస్తున్న టమాటాకాయలు నెర్రెలు చీలడం, కంద మెత్తగా అవుతున్నాయని, కేవలం 15శాతం మాత్రమే నాణ్యమైన సరుకు వస్తుంటే..85 శాతం నాణ్యత లేని పంట కొనుగోలు చేస్తున్నామని వ్యాపారులు తెలిపారు. ఆకాశాన్నంటుతున్న టమాటా ధరలను వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో మార్కెటింగ్‌శాఖ మార్కెట్లలో వేలంపాటల్లో పాల్గొని సరుకు కొనుగోలు చేసి రైతుబజార్లకు తరలించి సబ్సిడీ ధరలపై అందిస్తోంది.

- ప్రాథమిక బీజక్షేత్రంలో ఆగిన పట్టుగూళ్ల ఉత్పత్తి
- 24 ఏళ్ల సేవలకు సెలవు
- 18 ఎకరాల్లో వెలుగు వెలిగిన కేంద్రం
- ఇప్పుడు రెండెకరాల్లో విత్తన సాగు

పట్టు తప్పింది..!

బి.కొత్తకోట : సమైక్య రాష్ట్రంలో పట్టు రైతులకు మెరుగైన సేవలందించి, వారి కుటుంబాల్లో ఆర్థికాభివృద్ధికి బాటలు వేసిన.. బి.కొత్తకోట మండలం బయ్యప్పగారిపల్లె గ్రామంలోని ప్రాథమిక బీజక్షేత్రంలో పట్టుగూళ్ల ఉత్పత్తి ఆగిపోయి మనుగడం కోసం రెండు ఎకరాల్లో విత్తన ఉత్పత్తి కేంద్రంగా మారిపోయింది. 24 ఏళ్లకు పైగా పట్టు రైతుల సేవలతో తరించిన ఈ కేంద్రం ఇటు పూర్తిగా మూతపడలేక, పూర్తిగా పనిచేసే పరిస్థితి లేక కొట్టుమిటాడుతోంది. పట్టు గుడ్ల ఉత్పత్తి నిలివేయడంతో కేంద్రం మూతదశకు చేరుకొంది. అధికారులు, సిబ్బంది విధుల్లోనే ఉన్నప్పటికీ వారికి చేతినిండా పనిలేదు.



ప్రాథమిక బీజక్షేత్రం



విక్రయం కోసం సాగు చేస్తున్న మల్బరీ పంట

బి.కొత్తకోట–మదనపల్లె రహదారిపై 1990లో 18 ఎకరాల విస్తీర్ణంలో మల్బరీ సాగు చేస్తూ పట్టు రైతులకు మేలైన పట్టుగూళ్ల తయారీ ప్రారంభమైంది. ఈ కేంద్రం ప్రారంభంతోనే తంబళ్లపల్లె నియోజకవర్గంలో రైతులు మల్బరీ పండించి పట్టుగూళ్ల ఉత్పత్తి ప్రారంభించారు. పీ3–మౌలిక విదేశీజాతీ విత్తన కేంద్రమైన ఇక్కడికి కర్ణాటకలోని మైసూరు నుంచి పీ–3 పట్టుగుడ్లను తీసుకొచ్చి రేరింగ్ చేస్తారు. ముత్తాత గుడ్ల నుంచి కొడుకు, మనువడు రకం గుడ్లను రేరింగ్ చేశాక పీ–2 గుడ్లు తీస్తారు. వీటిని సీడ్‌ఫార్మ్‌కు తరలించాక పీ–2 నుంచి పీ–1 గుడ్లు తీస్తారు. దీనినే విత్తన గుడ్లుగా రైతులకు సరఫరా చేయడం జరుగుతూ వచ్చింది. ఇక్కడి వాతావరణ పరిస్థితులకు నాణ్యమైన, రోగరహిత గుడ్లను ఉత్పత్తి చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా వున్న గ్రేనేజీలకు పట్టుశాఖ ద్వారా సరఫరా చేసేవారు. ఈ ప్రక్రియ కోసం రేరింగ్ భవనాలు, వర్మీకంపోస్టు తయారీ భవనాలు ఏర్పాటు చేశారు. పదేళ్ల క్రితం వరకు ఓ వెలుగు వెలిగిన కేంద్రానికి నీటి సమస్య ప్రధాన కారణంగా మల్బరీసాగు విస్తీర్ణం భారీగా తగ్గిపోయింది. ఏడాదికి 250 నుంచి 300కు పైగా గుడ్లను తెచ్చేవారు. ఒక్కో గుడ్డు నుంచి 400కు పైగా గూళ్లను తీయడం జరిగేది. ప్రస్తుతం గుడ్ల సంఖ్య భారీగా తగ్గింది. ఐదేళ్లలో పరిస్థితిని పరిశీలిస్తే.. 2009–10లో 118, 2010–11లో 72, 2011–12లో 58, 2012–13లో 54, 2013–14లో 36 గుడ్లను మాత్రమే తీసుకొచ్చారు. ఆ తర్వాత నామమాత్రంగా ఉత్పత్తి కొనసాగుతూ వచ్చి ప్రస్తుతం ఉత్పత్తి పూర్తిగా నిలిపివేశారు. ఎంతో ఘనచరిత్ర కలిగిన ఈ కేంద్రంలో పదేళ్లుగా పట్టుగుడ్ల ఉత్పతి నిలిచిపోయిన గత చరిత్రగా మిగిలిపోతోంది. పడమటి మండలాల్లో మల్బరీ సాగుకు ఈ కేంద్రం ప్రోత్సాహంతో గ్రామాలకు గ్రామాలే పట్టు గ్రామాలుగా విరాజిల్లాయి. పట్టు రైతాంగానికి 24 ఏళ్ల సేవలు అందించిన ఈ కేంద్రం సెలవు తీసుకొంది.

తగ్గిన ఉద్యోగుల సంఖ్య

ఈ కేంద్రంలో గతంలో ఒక అసిస్టెంట్ డైరెక్టర్, వివిధ హోదాల్లో 12 మంది ఉద్యోగులు, క్షేత్రస్థాయి కార్మికులు 16 మంది పని చేసేవారు. ప్రస్తుతం ఒక అసిస్టెంట్ డైరెక్టర్, ఇద్దరు అసిస్టెంట్ సెరికల్చర్ అధికారులు, ఆరుగురు క్షేత్ర సహాయకులు పని చేస్తున్నారు. ప్రస్తుతం ఒక అసిస్టెంట్ డైరెక్టర్ ప్రాథమిక బీజ క్షేత్రం కేంద్రానికి బాధ్యతలు చూస్తున్నారు. ఏడీతోపాటు ఒక ఇన్‌స్పెక్టర్, ఒక జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు ఫార్మర్ వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు.

విత్తన ఉత్పత్తి

గూళ్ల ఉత్పత్తి నిలిచిపోవడంతో అధికారులు ఈ కేంద్రం మూతపడకుండా ఆలోచన చేశారు. మల్బరీ పంట కోసం విత్తన పుల్లలను పండించి రైతులకు విక్రయించేందుకు నిర్ణయించి రెండు ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మల్బరీ పంట పూర్తయ్యాక వాటిని పుల్లలుగా కత్తిరించి రైతులకు విక్రయిస్తారు. ఇదిలా ఉండగా ఇక్కడి భవనాలు నిరుపయోగంగా మారాయి. వీటిలో ఒకదాన్ని ఉద్యానవన పరిశోధన కేంద్రం కార్యాలయం కోసం కేటాయించారు. దీనిపై ఏడీ దేవోత్తమరెడ్డి మాట్లాడుతూ పట్టుగుడ్ల ఉత్పత్తి ఆగిపోయిందని, రెండెకరాల్లో విత్తన మల్బరీ ఆకును పెంచుతున్నామని చెప్పారు.

ఒంటిమిట్టలో హైకోర్టు న్యాయమూర్తి



హైకోర్టు జడ్జికి ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట : ఆంధ్రభద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో వెలసిన మూల మూర్తులను ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. వారు ఆలయ ప్రదక్షణ చేసి, గర్భాలయంలోని మూల మూర్తులైన సీతారామలక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రంగమండపంలో కాసేపు సేదతీరి, స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. వీరి వెంట కడప జిల్లా జడ్జి జి.గీత, రాజంపేట సబ్ జడ్జి కేశవ, సిద్దవటం జడ్జి శ్రీనివాస కల్యాణ్, ఆలయ టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్ బాబు, మండల తహసీల్దార్ మధవీలత, రెవెన్యూ సిబ్బంది, టీటీడీ సిబ్బంది ఉన్నారు.

డిజిటల్ అసిస్టెంట్ సస్పెన్షన్

చిన్నమండెం : మండలంలోని చిన్నమండెం -1 గ్రామ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న సిద్దారెడ్డిని సస్పెండ్ చేస్తూ అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశాలు జారీ చేశారు. సచివాలయానికి వచ్చే ప్రజలతో మర్యాద పూర్వకంగా మాట్లాడకపోవడం, వివిధ పనుల కోసం వచ్చే ప్రజల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధికంగా డబ్బులు తీసుకుంటున్నారని పలువురు స్థానికులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు డిజిటల్ అసిస్టెంట్ సిద్దారెడ్డిని సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పూజారులు మృతి

అనంతపురం జిల్లాలో ఘటన



ఆలయం వద్ద అనిల్‌కుమార్, రాఘవేంద్ర (ఫైల్)



అనిల్‌కుమార్, రాఘవేంద్ర మృతదేహాలు

తంబళ్లపల్లె /కురబలకోట : తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఆలయ పూజారులుగా పని చేస్తున్న ఇద్దరు అనంతపురం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారి కుటుంబీకుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం తుగ్గలి మండలం పగిడిరాయి గ్రామానికి చెందిన రాఘవేంద్రస్వామి(28) తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో పూజారిగా ఉన్నారు. ఆయన భార్య అనిత, ఇద్దరు చిన్నపిల్లలతో అంగళ్లులో కాపురం ఉండే వారు. ఆయన బావమరిది అనిల్‌కుమార్(29) కురబలకోట మండలం తెట్టు శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో పూజారిగా ఉన్నారు. ఆయనది అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం ముకుందాపురం. ఆయనకు ఏడాది క్రితం రాధమ్మతో వివాహం జరిగింది. రాఘవేంద్రస్వామి, అనిల్‌కుమార్ గార్లదిన్నెలోని సమీప బంధువు కానిస్టేబుల్ ఇంటికి వెళ్లారు. అతను మొహర్రం సందర్భంగా విధుల్లో బిజీగా ఉండటంతో శుక్రవారం సాయంత్రం వెనుదిరిగి బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో గార్లదిన్నె వద్ద ఐచర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో రాఘవేంద్రస్వామి అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన అనిల్‌కుమార్‌ను 108 వాహనంలో అనంతపురంలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో చనిపోయాడు. వారి మృతదేహాలకు శనివారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. అనంతరం స్వగ్రామాలకు తరలించారు. చిన్న వయసులోనే మృత్యువాత పడటంతో కుటుంబీకులు గుండెలవిసేలా రోదించారు. బంధుమిత్రులు కన్నీటి పర్యంతమయ్యారు. కురబలకోట, తంబళ్లపల్లె మండలాల్లో విషాదం నెలకొంది. తెట్టు గ్రామ సర్పంచ్ నులక మనోహర్‌రెడ్డి, తెట్టు ఆలయ కమిటీ చైర్మన్ కొరివి జగన్నాథ రెడ్డి, స్థానిక నాయకులు మాజీ ఉప సర్పంచ్ నారాయణ, ఆదినారాయణ విచారం వ్యక్తం చేశారు. వీరు మృతదేహాలను సందర్శించి, బాధిత కుటుంబీకులను పరామర్శించారు. రెండు కుటుంబాల వారు పేదరికం కావడంతో ఆలయ పూజారులుగా జీవనం సాగించే వారని తెలుస్తోంది.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్



ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసిన సెబ్ సిబ్బంది

పీలేరు : అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ వై.గురుప్రసాద్ తెలిపారు. వివరాలిలా వున్నాయి. ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో శనివారం మండలంలోని పొంతలచెరువు క్రాస్ వద్ద సెబ్ అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించారు. కలికిరి మండలం పల్లవోలుకు చెందిన మూడు ట్రాక్టర్లతో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించి సీజ్ చేశారు. ముగ్గురిని అరెస్ట్ చేసి, ట్రాక్టరుకు రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

సారా స్వాధీనం

మండలంలోని వేపులబైలు పంచాయతీ జంగంపల్లెలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారంతో సెబ్ సిబ్బంది దాడి చేశారు. జంగంపల్లెకు చెందిన ఎస్.భాగ్యమ్మ రెండు లీటర్ల సారా కలిగి ఉండగా, అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ వై.గురుప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది యోగానంద, సుధాకర్, బాలకృష్ణ, గంగామహేశ్వరి పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

రాయచోటి టౌన్ : రాయచోటిలో శనివారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా వెళ్లిన బాలిక ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. పట్టణంలోని ఓ కోచింగ్ సెంటర్‌కు ఉదయం వెళ్లిన మాధవి (10) మధ్యాహ్నమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లి దండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పలు రకాల మాధ్యమాలు, సీసీ ఫుటేజీల ద్వారా విచారణ చేపట్టి రాత్రి 9 గంటల సమయంలో ఆచూకీ గుర్తించారు. ఎస్ఎన్ కాలనీలోని ఓ హాస్పిటల్ వద్ద ఉన్నట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఆ బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటన సుమారు ఆరేడు గంటల పాటు తల్లిదండ్రులు, కోచింగ్ సెంటర్ నిర్వాహకులు, పోలీసుల్లో తీవ్ర ఉత్కంఠ కలిగించింది.

లారీ, బైక్ ఢీకొని యువకుడి దుర్మరణం

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన రోహిత్

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం బండపల్లి పంచాయతీ పెట్రోల్ బంకు సమీపంలో శనివారం లారీ, బైక్ ఢీకొనడంతో ఒకరు దుర్మరణం చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి పట్టణం పాతరాయచోటికి చెందిన పిక్కిలి రోహిత్ (20), గాలివీడుకు చెందిన వంశీ, మదనపల్లెకు చెందిన నవీన్ కొత్త మోటార్ సైకిల్‌పై రామాపురం వైపు నుంచి రాయచోటికి వస్తున్నారు. పెట్రోల్ బంకు సమీపానికి రాగానే రాయచోటి నుంచి కడప వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో రోహిత్ అక్కడికక్కడే మృతి చెందగా.. నవీన్, వంశీలకు తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోహిత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.


బైకు అదుపు తప్పి యువకుడికి గాయాలు

మదనపల్లె సిటీ : ద్విచక్ర వాహనం నడుపుతూ అదుపు తప్పడటంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె పంచాయతీ దేవరబురుజులో శనివారం జరిగింది. దేవరబురుజుకు చెందిన రామాంజులు కుమారుడు బాలాజీ(16) ద్విచక్ర వాహనంలో పొలం వద్దకు వెళుతుండగా మార్గంమధ్యలో వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. చికిత్సల కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.


మహిళపై దాడి

సెల్‌ఫోన్ విషయంపై ఓ మహిళపై దాడి చేసిన సంఘటన నిమ్మనపల్లె మండలం దిగువమాచిరెడ్డిగారిపల్లెలో జరిగింది. మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ కాట్లాటపల్లెకు చెందిన శాంతమ్మ(45) ఇంటి నిర్మాణ పనులకు జేసీబీ కోసం దిగువమాచిరెడ్డిపల్లెకు వెళ్లింది. సెల్‌ఫోన్ చార్జింగ్ లేకపోవడంతో ఓ ఇంటిలో చార్జింగ్ పెట్టింది. తిరిగి సెల్‌ఫోన్ కోసం వెళ్లడంతో ఇంటిలోని వ్యక్తులు ఫోన్ తమదేనంటూ దాడి చేశారు. గాయపడిన శాంతమ్మను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు.. ముగ్గురికి తీవ్ర గాయాలు



బస్సు కింద పడిన ద్విచక్రవాహనం



తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులు

మదనపల్లె సిటీ : ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఔట్‌పోస్టు పోలీసుల కథనం మేరకు... శనివారం రాత్రి ములకలచెరువు మండలం మద్దినాయునిపల్లె పంచాయతీ దాసిరెడ్డిగారిపల్లెకు చెందిన శ్రీనివాసులు (42) కుమార్తె తేజస్విని(13)తోపాటు తమ్ముడి కుమారుడు హరీష్(14)లను ద్విచక్రవాహనంలో కూర్చోబెట్టుకుని బురకాయలకోటకు వస్తున్నారు. మదనపల్లె నుంచి హైదరాబాదుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు పెట్రోల్ బంకు ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు(40) తలకు బలమైన గాయమైంది. వెనుక ఉన్న తేజస్విని, హరీష్‌లకు చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. తేజస్విని, హరీష్‌లు బురకాయలకోట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. బాధితులను 108 వాహనం ద్వారా మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఔట్‌పోస్టు పోలీసులు ములకలచెరువు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

బియ్యం వ్యాన్లకు నిప్పు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల మండల కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న రెండు బియ్యం పంపిణీ చేసే వ్యాన్లకు శనివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఏడాది కాలంగా వీటిని వ్యవసాయ గోడౌన్ దగ్గర పెట్టారు. ఈ నేపథ్యంలో శనివారం పట్టపగలే వాటికి నిప్పు పెట్టారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి మంటలు ఆర్పారు. కాలిపోయిన వాటి విలువ రూ.10 లక్షలు ఉంటుందని భావిస్తున్నారు. వీఆర్ఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

హక్కుల సాధన కోసం సమష్టి పోరాటం

గిరిజన రాష్ట్ర మహాసభల్లో వక్తలు



ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన సమైక్య శ్రేణులు



మాట్లాడుతున్న విప్లవ గాయని విమలక్క

రాయచోటి అర్బన్ : గిరిజన హక్కుల సాధనకు సమష్టిగా పోరాడుదామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య, విప్లవ గాయని విమలక్క తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు విశ్వనాథనాయక్ ఆధ్వర్యంలో గిరిజన సమాఖ్య 3వ రాష్ట్ర మహాసభలు జరిగాయి. అన్ని జిల్లాల నుంచి గిరిజనులు విచ్చేసి కదం తొక్కారు. మాసాపేట మార్కెట్ యార్డు నుంచి ప్రభుత్వ జూని యర్ కళాశాల మైదానం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం అందరం ఒక్కటై పోరాడాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశ్నిస్తేనే తమ హక్కులను సాధించుకోగలుగుతామన్నారు. అడవి మనదే.. అడవి భూములు మనవే అనే విషయాన్ని గుర్తుపెట్టుకుని అందరూ కలిసికట్టుగా అడవులను కాపాడుకోవాలంటూ కోరారు. అటవీభూమి హక్కుల ప్రకారం గిరిజనులు అటవీ భూములలో వ్యవసాయం చేసుకోవచ్చునంటూ తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్రనేతలు మన్మథరావు, రాముడు, సత్యనారాయణ, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రానాయక్, పెంచలయ్య, లంబాడా సంఘం రాష్ట్రనేత శంకర్‌నాయక్, సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, మహేష్, శ్రీనివాసులు, గిరిజన సంఘం నేత అమ్ములనాయక్‌తో పాటు పలు జిల్లాల నుంచి వచ్చిన గిరిజననేతలు పాల్గొన్నారు.